# కన్నీరు కార్చే వృక్షాలు

అప్పుడు జగన్నాధం తనకి ప్రత్యేకించిన గదిలో కూర్చుని ఉన్నాడు. అతను కూర్చున్నాడనే కంటే ఆ క్షణంలో, అతనాగదిలో తనని తనే బంధించుకున్నాడనే చెప్పాలి. గది నిశ్శబ్దం మధ్య బిక్కు బిక్కుమంటూ ఉంటే అతని మదిలో ఆందోళనా, అలజడీ రాజ్యం చేస్తున్నాయి

అందుకే అతనికి చెమటలు పడుతున్నాయి. టేబిల్ మీద ఆప్తులు, స్నేహితుల్లాంటి ఫోన్లు, ఇంటర్ కమ్, ఎ.సి. మిషన్ ఏవీ కూడా అతన్ని ఓదార్చలేకపోతున్నాయి. పేపర్ వెయిట్ కింద రెప రెప లాడే తెల్లకాగితంలా అతను కుర్చీలో అటూ ఇటూ కదలడం ఒక్కటే చెయ్యగల్గుతున్నాడు. గది గోడలకు ఎంతో ఇష్టంగా వేళ్లాడతీసిన, సౌజా, లక్ష్మాగౌడ్, జహంగీర్ సబ్ వాలా పెయింటింగ్స్ కన్పిస్తున్నాయి. మనసులో అశాంతిని దూరం చేసి, మనిషిని మరో లోకానికి తీసుకు పోయే వాటి లోని శక్తికి భక్తుడి మాదిరి ఎన్నోసార్లు తలవంచాడు. అలాంటిది, ఆ చిత్రాలు వరమీయని వేల్పుల్లా మొహాలు పక్కకి తిప్పుకుంటున్నట్టుగా కన్పించాయి.

అప్పటికే రోజులో రెండుసార్లు ఫోన్ మోసుకు వచ్చిన భయంకరమైన మాటలు అతనికి గుర్తుకు వస్తున్నాయి.

నిజమే, అతనికి ఏదో చెయ్యాలనే వుంది. కానీ ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో మాత్రం తోచడం లేదు. ముందుకు వెళ్లచ్చు. వెయ్యలేక పోతున్నాడు.. ఎందుకు?


ఇక్కడ జరుగుతున్న యుద్ధం, ప్రత్యర్థులతో కాదు. ఇది వ్యక్తిగతమైన విభేధాల వల్ల పుట్టింది కాదు... డబ్బు, పదవి, ఆ పైన స్త్రీ సంబంధమైన విషయాల్లో వచ్చిన పేచీ కాదు. అలాంటి వాటిని తేలిగ్గా పరిష్కరించవచ్చు. ఓ పెద్ద ఇండస్ట్రీని నడుపుతూ, వెయ్యిమంది జనాన్ని సంభాలిస్తున్న అతనికి చాకచక్యం గురించి, లౌక్యం గురించి, పట్టు విడుపుల గురించీ కొత్తగా తెల్సుకోవల్సిందేం లేదు.

అయితే, ఇది — ఒక వ్యక్తి భవిష్యత్ తో, బతుకుతో ముడిపడిన విషయం. సున్నితమైన హృదయానికీ, అంతకన్నా సున్నితమైన అనుబంధానికీ సంబంధించింది!

జగన్నాధం అంతకు మించి ఆలోచించలేక పోతున్నాడు. కారణం ఆ ఆలోచన రావడంతోనే అతని మెదడులో భయాల మబ్బులు, అనుమానాల మెరుపులు, ఆందోళనల ఉరుములూ మొదలవుతాయి.

జేబురు మాలుతో కళ్లు ఒత్తుకున్నాడు. ఇంతలో ఫోన్ మోగింది. అవతలి నుంచి మాటలు, మాటలతో పాటు బెదిరింపులు, బెదిరింపులతో కలిసిన నవ్వు.....

శ్రీసుధా



''వద్దు... అలా చెయ్యొద్దు.. ప్లీజ్'' జగన్నాథం ్రబతిమలాడుతూ అన్నాడు.


మళ్లీ నవ్వు....

''నేచెప్తున్నాను, విను.. నీకేం కావాలో చెప్పు''

ఫోన్ ఆగిపోయింది. జగన్నాథం గ్లాసులో నీళ్ళు ్రతాగాడు. కింగ్ సైజు రోత్‌మెన్స్ సిగరెట్ అంటించాడు. ... సిగరెట్‌తోపాటు మనసు అంటుకున్నట్టుగా — నోటి నుంచే కాకుండా పొగలు శరీరం మొత్తం నుంచివస్తోన్నట్టుగా అన్పించింది.

.. .. .. .. .

ఆఫీసులో జగన్నాథం అనుభవిస్తోన్నది నరకం అయితే ఇటు ఇంట్లో అనసూయకు ఎదురవుతున్నది కూడా అదే. సంతోషంగా సాగిపోతున్న తన సంసారాన్ని చూసుకుని ఆమె ఎన్నోసార్లు తనని మించిన అదృష్టవంతురాలు లేదని పొంగి పోయేది. కానీ అంతలోనే తేరుకుని, అన్ని అదృష్టాల వెనుకా ఒక అదృశ్యహస్తం నేవంటూ వుండి, అభయమిస్తూ వుంటుందనీ, మనుషులు ఒట్టి నిమిత్త మా్రతులేననీ గుర్తు చేసుకుని వెంటనే పూజగదిలోకి వెళ్లి పోయి సాయిబాబా ఫోటో ముందు నిలబడి పోయేది.



భర్త జగన్నాథం రెండు చేతులా సంపాదిస్తూ ఆ డబ్బుతోనే సరిపెట్టుకోమనకుండా ్రపేమను కూడా పంచిపెడుతుంటే — ఆమెలోకంలో కొద్ది మంది అదృష్టవంతుల్లో తననీ ఒకరుగా ఊహించుకునేది.

అయితే వారంగా ఆమె తన అదృష్టానికి ముసురుపట్టినట్టుగా తనని ఎవరో అభాగ్యురాల్నీ, అనాథనీ చేయబోతున్నట్టు అనుమానపడుతోంది. అవును, మొదటి సారి ఫోన్ వచ్చినప్పుడు 'రాంగ్ నెంబర్' అని ఫోన్ పెట్టేసింది. రెండో సారి ఫోన్ వస్తే 'ఎవరు మాట్లాడుతున్నది' అంటూ నెమ్మదిగా అడిగి, సమాధానం రాకపోయే సరికి కొంచెం కలత పడింది. కానీ మూడోసారి ఫోన్ లోంచి వినబడే మాటలతో ఆమె ఏడుపు ఆపుకోలేక పోయింది. ఆజ్ఞాత ్రకం తాలూకు సూర్య చం్రదనాడులు రెండూ ముళ్లపడ్డట్టు, శ్వాస ఆడనట్టు, అయిపోయింది. ఎంటనె భర్తకు ఫోన చేసి చెబితే ''ఇలాంటి ఫోనులు రావడం మాములు.. భయ పడకు'' అంటూ భర్త ఎంత చెప్పినా అనసూయ భయపడకుండా వుండడం, ఎలాగో తెలియడం లేదు.

అలాంటిది మళ్లీఅదే ఫోన్. అవే మాటలు, అదే బెదిరింపు. కంగారు పడుతూ భర్తకు ఫోన్ చేయబోయింది. ఫోన్ కూడా చేయలేదు. అంతలోనే గుమ్మం ముందు కారు ఆగిన చప్పుడయింది.

"మీ అబ్బాయే వచ్చారు లా వుంది" అంటూ వాకిట్లో కూర్చున్న అత్తగారితో అని, కారిడార్‌లోకి వెళ్లింది అనసూయ. కారు దిగుతున్న భర్త దగ్గరకు పరుగున వెళ్లి కూడా ఏమీ మాట్లాడలేక, అతని కళ్ళలోకి మాత్రం చూసి, ఆపైన చెయ్యి పట్టుకుంది. "ఇదేమిటి" అనేసి, "లోపలికి పద" అన్నాడు, నెమ్మదిగా జగన్నాథం.

ఇద్దరూ గదిలోకి వెళ్లారు. అనసూయ వెంటనే గది తలుపు వేసి మంచం మీద చతికిలబడి, "మళ్ళీ ఫోన్ వచ్చిందండీ" అంది. పక్కనే రాణి నిద్రపోతోంది. ఓ చేతిలో బాల్ పెన్ వుంది. గుండె మీద ఆనెల చందమామ మధ్యకు తెరిచి వుండి, ఫేన్ గాలి పేజీల్ని ఎగరేస్తుంది. చుట్టూ క్లాసు పుస్తకాలు... సగం వ్రాసి వదిలిన నోట్ బుక్స్.. రంగు బొమ్మల విజువల్ డిక్షన రీ... మై హాలిడే లైబ్రరీ .. బైండ్ బుక్స్.. జగన్నాథం సోఫాలో కూర్చుకున్నాడు.

"నాకు భయంగా వుందండీ" అనసూయ బావురుమంది. జగన్నాథం కుర్చీలోంచి లేచి, ఆమె పక్కన కూర్చుని, "చిన్నపిల్లలా ఏమిటిది ఊరుకో" అంటూ వీపునిమిరి, కన్నీళ్లు తుడిచాడు.

"అసలు, ఇది స్కూలు నుంచి రావడం ఆలస్యం అయితేనే నాకు వెయ్యి అనుమానాలు వస్తాయి. వీధి గుమ్మం వదిలి పెట్టబుద్ధి వేయదు. అలాంటిది రాణి కనబడకుండా పోతే నేను బ్రతకలేనండీ.. ఇది ఎవరికి అపకారం చేసిందని? దీన్నెందుకు ఎత్తుకు పోవాలి, వాళ్లు??" అనసూయ ఏడుస్తూ అంది.


"నాకు అదే అర్థం కావడం లేదు. తల తిరిగి పోతోంది."

"మనకు డబ్బుంది కదా.. అంతా వాళ్లకిచ్చేద్దాం. మన ఫ్యాక్టరీ వాళ్లపేర రాసేయండి — కావాలంటే! అంతే గాని కిరాతకం ఏదీ చెయ్యద్దని చెప్పండి..."

" అవును నాకూ అలానే అనిపిస్తోంది. కానీ వాళ్లు నేనేం చెప్పినా వినిపించుకోవడం లేదు. పోనీ పోలీసు కమిషనర్‌తో మాట్లాడమంటావా? కమిషనర్ ఏమిటి — ఐ.జి. కే కంప్లయింట్ చేస్తాను..."

"వద్దండీ. ఇది కంప్లయింట్లతో అయ్యే పని కాదు" అని అనసూయ ఆగి, ఆలోచనగా అంది "అసలు వాళ్లెవరయివుంటారు? మీకు వ్యాపారంలో అంతచేటు విరోధులున్నారా?గుర్తు చేసుకోండి..." జగన్నాథం తల ఆడించాడు. "మన వ్యాపారం ఈవేళటిదా, నిన్నటిదా. నాన్న ఏనాడో పెట్టిన ఫ్యాక్టరీ ఇది. నాకు బద్ద విరోధులెవరూ లేరు, అనసూయా...."

అనసూయ ఏమనుకుందో చటుక్కున కూతురు మీదకు వంగి, ఆమెను లేపుతూ, "రాణీ, ఒకసారి లే, మెలుకువ తెచ్చుకో" అంటూ కూతుర్ని, కాళ్లూ చేతులు పరిజేసి, తన ఒడిలోకి లాక్కుని బుగ్గల మీద అటూ ఇటూ మృధువుగా తడుతూ, తల్లీ మెలుకువ వచ్చిందా. చెప్పు ఈ మధ్య మీ స్కూలు దగ్గరికి ఎవరైనా అంకుల్ లాంటి వాళ్లు వచ్చి నీకు చాకలెట్లు అవీ ఇచ్చి ఏమైనా అడిగారా. నీ పేరు, నాన్న గారి పేరూ ఏమిటని.....?



"ఊరుకో అనసూయా. ఆ వెధవలు ఎవరో డబ్బు కోసం అలా అని వుంటారు. చూడు, రేపు నీకో నాకో ఫోన్ చేసి ఓ పదో ఇరవైవేలో అడుగుతారు. పారేద్దాం. సరేనా.? "

"అంతేనంటారా?"

"అవును నువ్వు కళ్లు తుడుచుకో... అమ్మ విందంటే ఇంకేం లేదు. ఇంటి పెంకులు ఎగిరేటట్టు శోకాలు పెడుతుంది. ఎందుకైనా మంచిది. పాపతో పాటు స్కూల్ వరకూ నువ్వో నేనో వెడుతూ వుందాం? స్కూలు అయ్యే టైమ్‌కు కారు తీసుకుని నువ్వెళ్లు.."

జగన్నాథం లేచి లైటార్పాడు. గదిలో ఒక్కసారి చీకటి వ్యాపించడం చూసి అనసూయ రాణి మీద చెయ్యి వేసి, ఆ పక్కనే పడుకుని — అంతటితో సంతృప్తి పడక కూతుర్ని తనకు మరింత దగ్గరగా తీసుకుంది. తన కూతురు, ఎవరి'కంటా కనబడకుండా గుండెల్లో దాచుకునే అవకాశం ఎలా దొరుకుతుందా అని ఆలోచిస్తోంది!

... ... ... .. .

"నాకు అమ్మా నాన్నా కావాలి. నాన్నమ్మ కావాలి" ఉదయం పది గంటల నుంచీ ఈ మాటలు తప్పించి మరోమాట రాలేదు రాణీ నోటి నుంచి. ఆ ఏడేళ్ళ పసిపాపకు స్కూలు దగ్గర జరిగిన విషయాలు గుర్తుకు వచ్చి ఆపసి మనసు ఎంత క్షోభ కు గురి అయిందో అంచనా వేయడం కష్టం. లేత మొహం, లేత బుగ్గలు, లేత వయసు లోపల ఎదుగుతున్న ఏపిల్ పండు లాంటి గుండెకు ఎంత చేటు గాయం అయ్యిందో తెల్సుకోవడమూ కష్టమే!

తన్నో గదిలో కూర్చో బెట్టారనీ, అలా కూర్చో పెట్టే ముందు తనకి అబద్దాలు చెప్పి, నమ్మించి, కారు ఎక్కించిన వాళ్లు దొంగలనీ, సినిమాల్లో కన్పించే కేడీ గాళ్లయి వుంటారనీ ఆ అమ్మాయికి అప్పుడు అన్పిస్తోంది. దాంతో అన్నీ గుర్తుకు వచ్చి ఏడుపు మొదలు పెట్టింది. ఏడ్చి ఏడ్చి తరువాత ఆకలి వేస్తోన్నట్టు కడుపు లోతుకు పోయినట్టు తెల్సుకుని టేబిల్ వైపు చూసింది. అక్కడ ఓ ప్లేటులో అన్నం, పక్కనే గిన్నెలో పులుసూ కన్పించి ఓ అడుగు ముందుకు వేసింది. బాధ ఆకలిని చంపేస్తుందనే మాట ఆ పసి పాప విషయంలో అబద్దమే అయింది. గబగబా టేబిల్ దగ్గర నిలబడి అన్నం మీద పులుసు పోసింది. ఎందుకో చెయ్యి

వెనకాడింది. ఇంట్లో అయితే డైనింగ్ టేబిల్ మీద అన్నం తినడం అలవాటు. అన్నం తినే ముందు స్నానం చేసి వేరే డ్రెస్ వేసుకోవడం తప్పనిసరి. రాణి అటూ ఇటూ చూసి ఓ ముద్ద నోట్లో పెట్టుకుంది. గుటక పడలేదు. పైగా వాసన వేసింది. అందుకే అన్నం కన్నా ఎక్కువగా నీళ్లు తాగింది. ఆఖరిగా చేతులు కడుక్కుందా మంటే నీళ్ళు మిగల లేదు. చాలా సేపు ఆ చేతిని అలానే సాచి వుంచింది. పది నిమిషాలు గడిచాయి. ఏం తోచలేదు. మనసు తిరిగి ఇంటి వైపు మళ్లింది. దాంతో కళ్లు చెరువులవడం మొదలైంది.

"అమ్మా, నాన్నా" అంటూ ఒకటికి పది సార్లు మూలిగింది. ఏదో ఆలోచన వచ్చిన దానిలా తలుపు దగ్గరకు వెళ్లి

"ఏమండీ, తలుపులు తెరవండి, నన్ను మా ఇంటికి తీసుకుపోండి" అంటూ పదిసార్లు పిలిచి కంఠం బొంగురు పోతూంటే,

"నాకు ఇక్కడ భయం వేస్తోంది" అంటూ ప్రాధేయ పూర్వకంగా బతిమలాడుతున్నట్టుగా అంది - ఏడుపుతో!

ఆ ఏడుపుకు గది దాటి వెళ్లగల వయసు లేదు. రాణీ ఏమనుకుందో బూటు కాళ్లతో తలుపుల్ని తన్నింది. కాళ్లు నొప్పి పెడితే చేతులతో బాదింది. కొంచెం సేపటికి కాళ్లూ, చేతులూ కూడా మొండికేస్తే అక్కడే చతికిలబడింది. అలా ఒకటి రెండు గంటలు గడిచాయి.

ఆ తర్వాత తలుపు తెరుచుకుంది. ఓ నలభై ఏళ్ల మనిషి లోపలికి వచ్చాడు. గది మధ్యలో నేలమీద మోకాళ్లలో తలవాల్చి కూర్చున్న రాణి తలెత్తి చూసింది. ఆమె కళ్లల్లో చిన్న ఆశ... అణువంతటి సంబరం మొలకెత్తాయి.

" మాఇంటికి వెళ్లిపోతాను. నన్ను తీసుకు వెళ్లవా. ఇందాకా నన్ను కారెక్కించి తీసుకు వచ్చింది నువ్వేగా"

అమాయకంగా ప్రాధేయ పడింది, రాణి.

నలభై ఏళ్ల వాడు రాయిలా మాట్లాడలేదు.

"నేను ఇంటికి వెడితే గానీ మా అమ్మా నాన్నా, అన్నం తినరు. మా నాన్నమ్మ అయితే నేను ఇస్తేనే గాని మంచినీళ్ళు కూడా తాగదు"

అప్పుడు రాయి తలుపుకు అడ్డంగా బాసిన పీట వేసుకుని కూర్చుకున్నాడు.

"నాకు ఆకలేస్తోంది. నన్నెందుకు తీసుకు వచ్చావ్. నాకిక్కడ భయం వేస్తోంది. వెళ్లిపోతాను.

రాయి లాంటి మనిషి కాస్త వెకిలిగా నవ్వాడు.

రాణి వెయ్యి చూసుకుంది. చేతికి వాచీ లేదు. "ఇప్పుడు టైం ఎంతయ్యింది. అమ్మో నేను బోల్డు హోమ్ వర్క్ చేసుకోవాలి. నా పుస్తకాల బేగ్ ఏది?" అంటూ చుట్టూ చూసుకుంది.

"నా పుస్తకాలు నాకు ఇచ్చెయ్"

"చూడు పిల్లా, నువ్వు ఇక్కడే వుండాల. మీ అమ్మనీ, నాన్ననీ మర్చిపో. ఆళ్లందరూ చచ్చిపోయారు. ఇక వాళ్లెవరూ నీకు కన్పించరు...."

ఆ మాటలతో చక్రాలంటి రాణి కళ్లలో నీటి కడవలు పగిలాయి.

తల ఎగరేస్తూ, రెండు చేతులతో కళ్లు తుడుచుకుంటూ,

"అమ్మా, నాన్నా.... అమ్మా" అంటూ ఏడ్వసాగింది.

"ఏడ్చావంటే ఊరుకోను... నేను మంచోణ్ణి కాను.."

"మా ఇంటికి తీసుకువెళ్లు నన్ను... ప్లీజ్ .. అంకుల్.. ప్లీజ్..."

"ఇప్పుడప్పుడే కాదు. నువ్వు ఇక్కడే ఈ ఇంట్లోనే వుండి పోవాలి. నే చెప్పిన పన్లన్నీ చెయ్యాలి. కాదని పేచీ పెట్టావో తోలు వలిచేస్తాను...."

రాణి భయపడింది. ఇంతలో ఇద్దరు మనుషులు లోపలికి వచ్చారు. వాళ్లల్లో ఒకడి చేతిలో చిన్న కత్తి వుంది. మరొకడు రాణి ముందుకు నడవడం మొదలుపెట్టాడు. వెంటనే రాణి ఏడుస్తూ లేచి ఎటు పరిగెత్తాలో తెలియక ఆ గదిలో నాలుగు గోడలనూ శరణుజొచ్చింది.

ఒకడు రాణీని పట్టుకుని గట్టిగా తన కాళ్ల మధ్య నొక్కి పెట్టాడు. ఆమె గింజుకుంటూ, గోళ్లతో గీరుతుంటే వీపు మీదా, మొహం మీదా బలంగా కొట్టాడు. రాణీ అతని చేతుల్లో లేత పువ్వులా నలిగి పోతూంటే ఆ మనిషి — తన పెద్ద చేత్తో ఆమె మూతిని మూసేశాడు.. అప్పుడు ఆమె మూగబోయింది. పది నిముషాల్లో మరొకడు రాణి బాబ్డ్ హెయిర్‌ని కత్తిరించి గుండు చేశాడు...

"ఒరేయ్.. ఆ పిల్ల బుగ్గ మీద పుట్టు మచ్చ తీసెయ్యి. ఆ చోటులో పెద్ద గాటు పెట్టు. అలాగే వంటి మీద పుట్టు మచ్చలన్నీ వెదికి కోసి పారెయ్. ఇదిగో అది ఓ వారం వరకూ ఎటూ కదల కుండా వుండాలి. కాలు మీదా గాట్లు పెట్టు." గుమ్మం దగ్గర నల్లరాయి చెబుతున్నాడు.

అప్పుడు, ఏడేళ్ల వయసుకు తను భరించవల్సిన శిక్షలన్నీ అర్థమవుతున్నాయి. కానీ. కానీ. మాట్లాడాలనుకున్న నోటికి పెద్ద చెయ్యి ఒకటి తాపడం అయింది. చేతులెత్తి వద్దని సౌంజ్ఞ చేయాలనుకుంటే చేతులు కాస్త బిగించబడి వున్నాయి.

అరగంటలో రాణీ అవతారం మారిపోయింది. వయసు తట్టుకోలేని గాయాలూ, ఒక్కసారి చిమ్మిన రక్తం ఆ చిన్నపిల్లను ఫెయింట్ అయ్యేటట్టు చేశాయి. ఐదు గంటల క్రితం, అపురూపంగా, అందంగా చూస్తే చిదిమి దీ


రుచికరమైన 19 రకాలలో లభ్యం కాగలవు.




ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.

పం పెట్టుకునే టట్టు వుండే ఏడేళ్ళ రాణి, అంద విహీనంగా, అవిటిగా, అనాథగా మారిపోయింది.

కానీ గుమ్మం దగ్గర కూర్చున్న మనిషి, అక్కడ జరుగుతున్న హింసను చూసి, కించె [illegible] మామూలు సంఘటన జరుగుతోన్నట్టుగా నిమ్మకు నీరెత్తినట్టు వుండి పోయాడు. బహుశా అతని హృదయంలోంచి చాలా ఏళ్ల క్రితమే, జాలి, కరుణా, ఆర్ద్రత లాంటివి తప్పుకున్న విషయం అతనికి బాగా గుర్తు!

''ఇది మొదలే.. ఇంకా వుంది కథ. ఇది అడుక్కు తినాలి. కూలి చేసుకుని బ్రతకాలి. అదీ దొరక్కపోతే మలమల మాడి చావాలి. అప్పుడు ... అప్పుడు.....''

రాయిలేచి బయటకు వెడుతూ, తలుపు దభాలున వేశాడు. ఆ భయంకరమైన చప్పుడుకు, శోష తప్పిన రాణీ శరీరం ఒక్కసారి ఉలిక్కి పడింది.

... ... ... ....

ఆ భయంకరమైన పగటికలకి అనసూయ కెవ్వున కేకపెట్టి మంచం మీద లేచి కూర్చుంది. ఒళ్లంతా చెమటలు. గుండె దడదడలాడుతోంది. గబగబా మంచం దిగి టెలిఫోన్ దగ్గరకు వెళ్లి స్కూల్ కి ఫోన్ చేసింది. ''క్లాస్ టూ రాణి వాళ్ల మదర్ ని మాట్లాడుతున్నా.. పాపనోసారి పిలవండి'' అంటూ.

అవతలినుంచి జవాబు వచ్చింది. అనసూయ కు నోట మాట రాలేదు. ''ఆ '' అనేసి, మళ్లీ ఆతృతతో, ''ప్లీజ్ మళ్లీ ఓసారి చెక్ చేయండి. క్లాసులో లేకపోతే ప్లేగ్రౌండ్ లో వుంటుంది. దాని స్నేహితులు వనజని, కోమలిని అడగండి. '' ఐదు నిముషాల తర్వాత మొదటి జవాబు తిరిగి వచ్చింది.

[illegible] ఒంట్లో ప్రతీ అవయవాన్నీ అచేతనత్వం ఆక్రమిస్తోంది. నేలమీద చతికిలబడి, ఫోన్ వళ్లో పెట్టుకుని భర్తకి ఫోన్ చేసి జరిగిందంతా చెప్పింది.

అవతలి నుంచి ''నేను ఇంటికి వస్తున్నాను. నువ్వు కంగారు పడకు'' జగన్నాథం మాటలు వినిపించాయి. అనసూయ అలాగే వెళ్లి గేటు తెరుచుకుని మెట్ల మీద కూర్చుండి పోయింది.

పది నిముషాల్లో కారు మీద జగన్నాథం వచ్చాడు. అనసూయ కారు ఆగడం తడవుగా, 'రాణీ' అనేసి కారెక్కింది. అంతకు మించి ఆమేం మాట్లాడలేకపోయింది.

మారుతీకారు తను ఇక వెళ్లలేనంత వేగంతో రోడ్డు మీద ప్రయాణం చేసి స్కూలు దగ్గర ఆగింది. జగన్నాథం అనసూయా సరాసరి ప్రిన్సిపాల్ రూమ్ లోకి వెళ్ళారు. ఆవిడ వాళ్ళిద్దర్నీ చూసి, 'సారీ, రాణి డ్రిల్ పైవ్ లోనే బయటకు వెళ్ళిందని తెలిసింది.'' అంటూ రాణి స్నేహితులకు కబురు పెట్టింది. వాళ్లు ఒక్కొక్కళ్లే వచ్చి రాణి, ఎప్పుడు, ఎలా ఎవరితో వెళ్ళిందో తమకు తోచినట్టు చెప్పారు.

''పోలీస్ కంప్లయింట్ యివ్వడం మంచిది...'' ప్రిన్సిపాల్ అంది.

అరగంట తర్వాత జగన్నాథం, అనసూయ ఇంటకి వచ్చారు. ఇద్దరూ ఇంటిలోకి వెళ్ళలేక గుమ్మాల్లోనే కూలి పోయారు. సెకన్లు నిముషాలుగా మారుతూ, నిముషాలు అతిభారంగా [illegible]

''పోలీసులకేమైనా ఆచూకీ దొరికిందేమోరా. కనుక్కో...'' జగన్నాథం తల్లి అంది. ఇంటి చుట్టు పక్కల వాళ్లు వచ్చి సానుభూతిగా మాట్లాడం మొదలైంది. ఊళ్ళోంచి చుట్టాలు, జగన్నాథం ఫ్యాక్టరీలో పని చేసే వ్యక్తులూ పోగయ్యారు.

మరో గంట గడిచింది.

''పాపాయి... పాపాయి ఇంటికి రాదంటారా? ఇక మనకి కనబడదంటారా'' హిస్టీరియా వచ్చిన దానిలా అనసూయ అడుగుతూనే వుంది.

''లేదు... అలా జరగదు...''

ఆరాత్రి రేడియోలో, టి.వి.లో ఆ మర్నాడు పేపర్లల్లో రాణీ కనబడకుండా పోయిన వార్త పడింది.. అంతే!!

రెండు మూడు నెలలు దొర్లిపోయాయి. విశ్వప్రయత్నం చేసినా ఏడేళ్ల రాణీ కన్పించని బాధలో దుఃఖంలో వేగి వేగి కాగి కాగి జగన్నాథం, అనసూయా రాళ్లుగా మారారు. అయితే ఇప్పుడు ఆ దంపతులిద్దరూ ప్రతి రోజూ కారు మీద బయటకు వెడతారు. ఎక్కడ అనాథ శిశువులు కన్పించినా కారాపి, వాళ్లని పరీక్షించి చూస్తారు.

కళ్ల వెంబడి వచ్చే కన్నీటిని తుడుచుకుంటూ వాళ్లకు కొత్త బట్టలు కట్టపెట్టి తీపి మిఠాయిలు తినిపిస్తారు. అవిటి వాళ్లూ, గుడ్డివాళ్లూ అయితే చెప్పనే అక్కర్లేదు. వాళ్ళని చూసి గుండెలవిసేటట్టు విలపిస్తారు— మూగగా!!

ఊళ్లో, దేశంలో వున్న లక్షలాది అనాథల్లో తమ బిడ్డ రాణీ కూడా ఒకత్తె అయివుంటుందనీ — తమ చిన్నారి తమకు ఏదో నాడు కన్పిస్తుందనీ, అంతవరకూ కళ్లు కాయలు కాచేటట్టు చూడ్డం తప్ప తమకు మరోదారి లేదనీ వాళ్లకో నమ్మకం! ఆశ!!

